క్లుప్తంగా

ప్రసన్న ఆంజనేయస్వామి తిరునాల నేడు

సుండుపల్లె : మండల పరిధిలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ పింఛా ప్రాజెక్టుపై వెలసిన శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి నిండు తిరునాలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ ప్రజలు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం రుద్రాభిషేకం, ఆకుపూజ, నైవేద్యం, తీర్థప్రసాదాలు పంపిణీ ఉంటాయన్నారు. సాయంత్రం సీతారాముల కల్యాణం జరుపనున్నట్లు తెలియజేశారు. రాత్రికి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో సాంస్కృతిక కార్యక్రమాల నడుమ డప్పు వాయిద్యాలతో బాణసంచాలతో చాందినీబండ్ల ప్రదక్షిణలు చేస్తాయని చెప్పారు.

అన్నదాత సుఖీభవను అందరికీ వర్తింపజేయాలి

చిట్వేలి : అన్నదాత సుఖీభవ పథకాన్ని డీకేటీ, మెట్ట, ఇనామ్ తదితర భూములు కల్గిన రైతులందరికీ వర్తింపచేయాలని రైతు నాయకులు మలిశెట్టి రాహుల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిట్వేలిలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం రైతులందరికీ రైతు భరోసా అందించినట్లుగానే ఈ ప్రభుత్వం కూడా రైతులందరికీ అన్నదాత సుఖీభవను అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకటయ్య, ఎ.నారాయణ, మణి, చెంగయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి దాతృత్వం

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీకి చెందిన పి.బాదుషా సాహెబ్ పెనగలూరు హైస్కూల్ విద్యార్థుల కోసం లక్ష రూపాయలతో సైకిల్ షెడ్డు ఏర్పాటు చేశారు. బాదుషా సాహెబ్ ఎస్ఎస్ఎల్సీ పెనగలూరు హైస్కూల్ లో చదివారు. తన తండ్రి హుస్సేన్ సాహెబ్ జ్ఞాపకార్థం సైకిల్ షెడ్డును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. షెడ్ ఏర్పాటు పై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డితోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

పుల్లంపేట : మండల విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్బీవీడీ సభా హైస్కూల్ ప్రాంగణంలో ఎస్బీవీడీ కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ రాజు, సంఘం అధ్యక్షులు సుబ్బనరసారెడ్డి చేతులమీదుగా మండల పరిధిలోని దళవాయిపల్లికు చెందిన ఆర్.సెకా పుట్టినరోజు సందర్భంగా గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాలాజీ రాజు మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వాహిద్, కోశాధికారి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బషీర్‌ఖాన్‌ను పరామర్శిస్తున్న మోహన్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణానికి చెందిన మైనార్టీ నేత హాజీ బేపారి బషీర్‌ఖాన్‌ను గురువారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పరామర్శించారు. వారి కుమారుడు బేపారి మహమ్మద్‌ఖాన్‌తో ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హరూన్‌బాషా, తఫీమ్ హబీబ్, అసద్, జబీవుల్లా, సూరం వెంకటసుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



నందలూరు : మండల కేంద్రంలోని నందలూరు జెడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎస్ఎంసీ చైర్మన్ ఉపేంద్ర ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీపై వెళ్తున్న రౌఫ్ బాషా, రజిని, క్రిష్ణయ్య, సురేష, మూర్తి, వరప్రసాద్‌లను పూలమాల, శాలువాతో సన్మానించారు. విద్యార్థులు తమ గురువులకు బహుమతులు అందజేశారు.

అర్హులు ఓటరుగా దరఖాస్తు చేసుకోండి

రాయచోటి టౌన్ : 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును పొందే అర్హత కలుగుతుందని ఆర్‌డీఓ శ్రీనివాసులు తెలిపారు. గురువారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. అందుకోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇప్పటి వరకు కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న వారి వివరాలకు సంబంధించిన లిస్ట్‌పై పరిశీలించి నాయకులకు వివరించారు. జులై 7వ తేదీ బూత్ లెవల్ అధికారుల సమావేశం నిర్వహించబడుతుందని చెప్పారు. అలాగే ఈ సమావేశానికి వచ్చిన వారికి ఫారం-6(9) ఫారం-7(10) ఫారం-8(11)లు అందజేశారు.

నిషేధం.. నీరుగారింది

- కోడూరులో మితిమీరిన ప్లాస్టిక్ వాడకం
- ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారుల విఫలం
- ప్లాస్టిక్ కారణంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం తింటున్న గోవులు



కోడూరులోని చిట్వేలి బ్రిడ్జి వద్ద డంప్‌ను తలపిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మేజర్ పంచాయతీలో ప్లాస్టిక్ ఎప్పుడో నిషేధించినప్పటికీ ప్లాస్టిక్ వాడకం మితిమీరింది. ప్రజలలో అవగాహనా లోపం, నిషేధం అమలు చేసే యంత్రాంగం సామర్థ్యం లేకపోవడం వల్ల ప్లాస్టిక్ నిషేధం నీరుగారిందనే చెప్పాలి. ముఖ్యంగా ప్రధాన రహదారి చిట్వేలి బైపాస్‌రోడ్డు నుంచి టోల్‌గేటు వరకు ప్రధాన రహదారిలో ఇరువైపులా వ్యాపార సముదాయాలు దండిగా ఉన్నాయి. అయితే ప్రతినిత్యం వ్యాపారస్తులు దుకాణాలు మూసే సమయంలో ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు, అట్టపెట్టెలు ఇవన్నీ డ్రైనేజీ కాలువలో పడేస్తుండటంతో డ్రైనేజీ స్తంభించిపోయి పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారవుతోంది. ముఖ్యంగా మద్యం దుకాణాలు, హోటళ్లు, టీ దుకాణాలు, వస్త్ర దుకాణాల యజమానులు రాత్రి సమయంలో అన్ని డ్రైనేజీలోనే వేస్తుండటంతో పాత బస్టాండు నుంచి ముష్టేరు వరకు ఇరువైపులా డ్రైనేజీ స్తంభించిపోయి కవర్లతో నిండిపోతోంది. దీంతో డ్రైనేజీ నీరు నిలిచిపోయి రోడ్డుపైకి వస్తుంటుంది. వర్షాకాలంలో అయితే డ్రైనేజీ నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తుంటుంది. పంచాయతీ అధికారులు ఎన్నిసార్లు సమావేశాలు నిర్వహించి ఆదేశాలు ఇచ్చినప్పటికీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకానొక దశలో నోటీసులు కూడా జారీ చేసినప్పటికీ తరువాత చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు.

దీంతో డ్రైనేజీవ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైపోయింది. దీనికితోడు పట్టణంలో 100కు పైగా గోవులు నిత్యం ప్రధాన రహదారిలో సంచరిస్తుంటాయి. రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాలు ఉన్నాయి. అయితే ప్రతినిత్యం వ్యాపారస్తులు దుకాణాలు మూసే సమయంలో ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు, అట్టపెట్టెలు ఇవన్నీ డ్రైనేజీ కాలువలో, రోడ్డుపైనే వేస్తుంటారు. వీటిని కొన్ని ఆవులు తింటుంటాయి దీనివల్ల పశువులు చనిపోయే ప్రమాదముంది.

మూగజీవులకు ప్రమాదం



ప్లాస్టిక్ కవర్లు వ్యర్థాలను మూగజీవులు తినడం వల్ల వాటి మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదముంది. వాటికి తెలీక తినడం వల్ల అవి కడుపులోనే ఉండిపోయి కొన్నిరోజులకు మరణిస్తున్నాయి. మనుషుల నిర్లక్ష్యం వల్ల మూగజీవులు బలి అవుతున్నాయి.

–డాక్టర్ ప్రతాప్, పశు సంవర్ధకశాఖ వైద్యులు, శెట్టిగుంట, రైల్వేకోడూరు

పర్యావరణానికి ముప్పు



మితిమీరిన ప్లాస్టిక్ వాడడంతో అంతే స్థాయిలో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. వృథా అయిన ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు భూమిలో ఇమడక వేల సంవత్సరాలు అలాగే ఉండి పర్యావరణానికి, పచ్చదనానికి ముప్పు వాటిల్లుతోంది.

–కోటకోండ శివకుమార్, పర్యావరణ, వృక్షశాస్త్ర అధ్యాపకులు, రైల్వేకోడూరు

పలుమార్లు హెచ్చరించాం



టీ దుకాణదారులకు, కిరాణా దుకాణదారులకు పలుమార్లు హెచ్చరించినప్పటికీ నిర్లక్ష్యంగా డ్రైనేజీ కాలువలోనే చెత్తాచెదారం పడేస్తుండటంతో సమస్య ఏర్పడుతోంది. సంవత్సరానికి రెండు, మూడు పర్యాయాలు ఈ ప్రాంతంలో డ్రైనేజీని పూడిక తీయాల్సి వస్తోంది. అందరూ దీని వల్ల ఎదురయ్యే పరిణామాలపై అవగాహన తెచ్చుకొని డ్రైనేజీలలో చెత్తను వేయడం ఆపాలి.

– బుడుగు శివయ్య, సర్పంచ్, రైల్వేకోడూరు

వైఎస్ జగన్‌ను కలిసిన మదన్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ అధినేతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మదన్‌రెడ్డి

రాజంపేట : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి మేనల్లుడు, నియోజకవర్గ యువనేత గాలివీటి విజయసాగర్‌రెడ్డి(మదన్‌రెడ్డి) గురువారం తాడేపల్లెలో కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు జరుగుతున్న నష్టాలను అధినేతకు మదన్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా మదన్‌రెడ్డి ×సాక్షి×తో మాట్లాడుతూ అధినేతతో పార్టీ పరమైన అంశాలను మాట్లాడినట్లు వివరించారు. తన వంతుగా పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు.

కాలభైరవునికి పూజలు

నందలూరు : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే కొలువైన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని కాలభైరవునికి గురువారం అష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సరసా రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కాపుపల్లి సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాల సమస్యలు పరిష్కరించాలని గురువారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్ రెడ్డి, రాయలసీమ బూత్ కమిటీ జోనల్ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్ రెడ్డిలు తహసీల్దార్ యామినీ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగంపేట కాపుపల్లి హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాలకు రేషన్ సరఫరాలో ఇబ్బందులు పడుతున్నారని, గతంలో వ్యాన్ ద్వారా రేషన్ ప్రతి ఇంటికి రావడంతో ఇబ్బందులు లేకుండా ఉండేదని, ప్రస్తుతం దాదాపు నాలుగు కిలోమీటర్లు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉందని, సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. అనంతరం పలు సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు. తదుపరి తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె.రమణారెడ్డి, గజ్జల శ్రీనివాస్ రెడ్డి, సుబ్బారెడ్డి, ఖడ్గపాని తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తల పాటింపుతోనే జ్వరాల నివారణ



జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సిద్దవటం : సీజనల్ జ్వరాలపై అవగాహన తెచ్చుకొని జాగ్రత్తలు పాటించాలని పి. కొత్తపల్లె పిహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు విద్యార్థులకు సూచించారు. గురువారం సిద్దవటం మండలంలోని టక్కోలు జెడ్పీహెచ్ఎస్‌లో సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మాట్లాడుతూ అపరిశుభ్రత ప్రాంతాల్లో ఉండే చోట దోమలు ఉత్పత్తి చెంది దోమలు కుట్టడం వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి విషజ్వరాలు సోకుతాయని మలేరియా జ్వరం వస్తే చాలా ప్రమాదమని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఇంటి చుట్టూ చెత్తాచెదారం నిల్వలు లేకుండా చూడాలని దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. అలా చేయడం వల్ల నీళ్లలో దోమలు గుడ్లు పెట్టకుండా తద్వారా అవి దశలవారీగా లార్వా, ప్యూపా దోమగా అభివృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. విద్యార్థులు ఆహారం తీసుకునేటప్పుడు, చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నరసమ్మ, సూపర్‌వైజర్ మౌలాలి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవల్లిక, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

లక్కిరెడ్డిపల్లి : షెడ్యూల్ తెగల కులాల వారు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ సెక్రటరీ నాగమణి పేర్కొన్నారు. సర్పంచ్ రెడ్డయ్య అధ్యక్షతన షెడ్యూల్ తెగల కులాల వారికి ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందాలంటే ఈనెల 15వ తేదీ నుంచి 30వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రేషన్ కార్డు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పీఎం కిసాన్ కార్డు, జన్‌ధన్ బ్యాంక్ అకౌంట్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ రిజ్వాన్ బేగ్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు, షుగర్, బీపీ రక్తహీనత పరీక్షలు 25 మందికి నిర్వహించారు. ఎనిమిది మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు, నలుగురికి కొత్త రేషన్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ రవీంద్ర, మహిళా పోలీస్ నాగమణి, ఏఎన్ఎం పద్మావతి, ఎంపీఈఓ పావనీ, సచివాలయ సిబ్బంది ప్రతాప్, పృథ్వీరాజ్, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

రాజంపేట టౌన్ : నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నగర కార్యదర్శి వెంకటేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం ఈ విషయమై ఏబీవీపీ నాయకులు ఎంఈఓ-2 సుబ్బరాయుడుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలు పాటించకుండా విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ వేలు, లక్షల రూపాయిలు ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అలాగే పాఠ్యపుస్తకాలు, బూట్లు, బెల్ట్‌లు, టై, యూనిఫాం వంటి వాటిని కూడా పాఠశాలల యాజమాన్యాలే విక్రయిస్తూ, వాటిని ఆయా పాఠశాలల్లోనే విద్యార్థుల తల్లిదండ్రులతో కొనుగోలు చేస్తున్నాయని ఆరోపించారు. తొంభై శాతానికి పైగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు క్రీడా మైదానాలు కూడా లేవన్నారు. అనేక పాఠశాలల్లో విద్యార్హత లేని వారితో బోధనలు చేయిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అలాగే ఫిట్‌నెస్ లేని బస్సులను కూడా నడుపుతున్నారన్నారు. అందువల్ల విద్యాశాఖ అధికారులు జిల్లాలోని అన్ని పాఠశాలలను తనిఖీ చేసి నిబంధనలను పాటించని పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పెన్నిది వర్మ, రాహుల్, వైష్ణవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థినులకు అండగా శక్తి యాప్'

రాజంపేట రూరల్ : విద్యనభ్యసించే విద్యార్థినులతో పాటు యువతులకు శక్తి యాప్ అండగా నిలుస్తుందని అర్బన్ ఏఎస్ఐ ఎస్ ఖాసీం సాహెబ్ తెలియజేశారు. స్థానిక కాకతీయ విద్యాసంస్థలలోని వైష్ణవి డిగ్రీ కళాశాల సభా భవనంలో గురువారం ఏఎస్ఐ ఖాసీంసాహెబ్ విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని తమ సెల్ ఫోన్‌లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మీకు ఎటువంటి సమస్యలు తలెత్తినా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. 79934 85111 శక్తి వాట్సాప్ నెంబర్‌ను ఫీడ్ చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లే అవసరం లేకుండా యాప్ ద్వారా 100, 112 నెంబర్‌లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అదే విధంగా ఎస్ఓఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. తక్షణమే సహాయక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పోలా వెంకటరమణారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ముమ్మినేని ఈశ్వరయ్యనాయుడు, మహిళా కానిస్టేబుల్‌లు కల్పన, రాజేశ్వరిలతో పాటు వైష్ణవి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

సిద్దవటం : తన తండ్రి జ్ఞాపకార్థంపాఠశాలల విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేసినట్లు వంతాటిపల్లె మెయిన్ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ తన తల్లితో కలిసి వెలుగుపల్లె, జంగాపల్లె, కమ్మపాలెం, వంతాటిపల్లె(మెయిన్) గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు స్లేట్లు, స్లేట్ పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, రబ్బర్లు, షార్పనర్లు, పంపిణీ చేయడం జరిగిందన్నారు. తన తండ్రి దూల్ల వెంకటసుబ్బారెడ్డి (రిటైర్డ్ ఏఎస్ఐ) జ్ఞాపకార్థం కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నివాళి



రాజమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణం సాతపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ రాజంపేట మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొజ్జా పెంచలయ్య తల్లి రాజమ్మ (48) గురువారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి రాజమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. పెంచలయ్యను ఓదార్చి, ధైర్యం చెప్పారు.

నివాళి.. పరామర్శ

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి గురువారం రాజమ్మ, శ్రీనివాసరాజుకు నివాళులు అర్పించారు. అదే విధంగా వారి బంధువులను పరామర్శించారు. మండల పరిధిలోని గుండ్లూరు పంచాయతిలో గల శంకరాపురంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కసిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి అత్త మేడా రాజమ్మ మరణించారు. ఈ రోజు రాజమ్మకు దశదిన కర్మ నిర్వహించారు. పాల్గొన్న ఆకేపాటి రాజమ్మకు నివాళులర్పించారు. అనంతరం మునక్కాయపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరాజు అనారోగ్యంతో మరణించడంతో మృదేహానికి ఎమ్మెల్యే ఆకేపాటి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో ఎంపీటీసీ ఎ.వరదరాజు(బాబు), నాయకులు గంగా కల్యాణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

చిన్నమండెం/లక్కిరెడ్డిపల్లె : ఈ నెల 21వ తేదీన (రేపు) ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని చిన్నమండెం మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, లక్కిరెడ్డిపల్లి ఎంపీడీఓ ఉషారాణిలు తెలిపారు. గురువారం వేర్వేరు కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. ప్రతి సచివాలయం పరిధిలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడి హేయం



శ్రీ చైతన్య పాఠశాల గేట్ ఎదురుగా నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయచోటి టౌన్ : విజయవాడలో ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నమయ్య జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. గురువారం రాయచోటిలోని శ్రీ చైతన్య పాఠశాల ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరావు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శ్రీచైతన్య, నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థల పక్షాన పని చేస్తూ ప్రభుత్వ విద్యను కుదించే విధానాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన మంత్రి కార్పొరేట్ విద్యాసంస్థలకు తలపాగా కట్టారని విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు కార్పొరేట్ విద్యకు వ్యతిరేకంగా గళమెత్తి విద్యా వ్యతిరేక విధానాలను బట్టబయలు చేయడంతో పాటు విద్యార్థుల హక్కుల కోసం పోరాటం సాగిస్తున్నందుకు పోలీసుల ద్వారా అణచివేసే చర్యలు తీసుకోవడంతో పాటు లాఠీచార్జ్ చేయడం హేమయమైన చర్యని అన్నమయ్య జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాదవ్ అన్నారు. లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే కార్పొరేట్ విద్య వ్యతిరేక ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గం ఏఐఎస్ఎఫ్ నాయకులు మహమ్మద్, దినేష్, నారాయణ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే సికెల్‌సెల్ అనీమియా నివారణ



వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సుండుపల్లె : ప్రజలందరూ సికెల్‌సెల్ అనీమియా పట్ల జాగ్రత్త వహించాలని రాయవరం పీహెచ్‌సీ డాక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిన్నబిడికిలో గురువారం సికెల్ సెల్ అనీమియాపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి అనువంశికముగా ఈ వ్యాధి సంక్రమిస్తుందని, దీనిని రక్తపరీక్షల ద్వారా నిర్ధారించుకుని చికిత్స ద్వారా అరికట్టవచ్చన్నారు. గిరిజన ప్రాంతాలలోని ప్రజలకు సికిల్‌సెల్ అనీమియా వచ్చేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రక్తకణాలు తగ్గడం, కళ్లు పసుపు రంగు మారడం, తీవ్రమైన నొప్పులు, శ్వాస తసుకోవడంలో ఇబ్బంది, అలసట, గర్భధారణలో సమస్యలు ఈ వ్యాధి ముఖ్య లక్షణాలని తెలియజేశారు. ముఖ్యంగా 40 సంవత్సరాలలోపు వయస్సున్న వారికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, జయపాల్, రమాదేవి, లక్ష్మీప్రసన్న, ప్రేమలత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

సిద్దవటం : గిట్టుబాటు ధర లేక మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలని వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు సింగం క్రిష్టారెడ్డి కోరారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాతూ మామిడి కాయలు చెట్లకే మాగి పురుగులు పడుతున్నాయన్నారు. ధరల పతనం కావడంతో మామిడినే నమ్ముకున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. గత ఏడాది ఎకరాకు రూ.50వేలు వచ్చిందని, ఈ ఏడాది ఎకరాకు రూ.10వేలు కూడా రాలేదని రైతులు వాపోతున్నారన్నారు.

బేనిషా రకానికి చెందిన పండ్లు కిలో రూ.30 అడుగుతున్నారన్నారు. మామిడి కాయ పక్వానికి వచ్చి మాగిపోయి పురుగులు పడుతున్నాయన్నారు. మామిడిని నమ్ముకున్న రైతులు తోటలోనే కుళ్లిపోతున్న కాయలను చూసి రైతులు కుమిలిపోతున్నారన్నారు. పెట్టిన పెట్టుబడులు రాక చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని దుస్థితిలో మామిడి రైతులు ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అంబరాన్నంటిన గంగమ్మ జాతర

- భారీగా తరలివచ్చిన భక్త జనం
- ముగిసిన గాదెల గంగమ్మ జాతర



గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



మొక్కులు తీర్చుకునేందుకు భారీ సంఖ్యలో హాజరైన భక్త జనం (ఇన్‌సెట్) పూజలందుకున్న గంగమ్మ

ఓబులవారిపల్లె : దశాబ్దాల కాలం తరువాత గాదెల పంచాయతీలో నిర్వహించిన గంగమ్మ జాతర కనుల పండువగా జరిగింది. గ్రామ దేవత గంగమ్మను ప్రతిష్ఠించి పెద్దఎత్తున పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన జాతరలో తల్లెంవారిపల్లి, గాదెల కొత్తపల్లి గ్రామాలలో ఊరేగింపు నిర్వహించి ఘనంగా జాతరను జరిపారు. తెలుగు రాష్ట్రాలే కాక ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి సైతం పెద్దఎత్తున బంధువులు, గ్రామస్తులు జాతరకు తరలివచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మకు పూజలు నిర్వహించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలను, పొంగుబాలను పొంగించారు. అనంతరం గ్రామం మొత్తం ప్రతి ఇంటిలో మధ్యాహ్నం భోజనం పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లి ఎస్ఐ పి.మహేష్ నాయుడులు ఎక్కడా గొడవలు జరగకుండా భారీ బందోబస్తు కల్పించారు. భక్తుల రద్దీతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. గురువారంతో గంగమ్మ జాతర వైభవోపేతంగా ముగిసింది.

గంగమ్మను దర్శించుకున్న కొరముట్ల

గాజుల గ్రామంలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతరలో గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే, రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీపీ రామకృష్ణ ఆహ్వానం మేరకు ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ప్రజలందరిని చల్లంగా చూడు తల్లి అని మొక్కుకున్నట్టు కొరముట్ల తెలియజేశారు. అనంతరం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో వారు సమావేశమై పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో సింగల్ విండో మాజీ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరు కృష్ణారెడ్డి, రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరాచక టీడీపీ పాలనకు చరమగీతం పాడు తల్లీ..



ప్రత్యేక పూజలు చేయిస్తున్న సిగమాల

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అరాచక పాలనకు చరమగీతం పాడి ప్రజలను చల్లగా కాపాడాలని గురువారం గాదెల గంగమ్మకు వైఎస్సార్ సీపీ నాయకులు సిగమాల రామచంద్రారెడ్డి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి, అణచివేసేలా, మహిళలకు రక్షణ లేకుండా సాగిస్తున్న కూటమి పాలనను అంతమొందించేలా చూడాలని గంగమ్మకు మొక్కుకున్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని ఆయన కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జబ్బిరెడ్డి మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.